www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 17 ఆగస్టు 2025




## నేడు పాలకొల్లుకు మంత్రి లోకేష్

### మంత్రి నిమ్మల కుమార్తె నిశ్చితార్థానికి హాజరుకానున్న లోకేష్

ప్రజాశక్తి - పాలకొల్లు

జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఆదివారం పాలకొల్లు రానున్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు ఇంట జరిగే నిశ్చితార్థం వేడుకల్లో పాల్గొనున్నారు. స్థానిక ఎస్.కన్వెన్షన్‌లో ఉదయం 7.16 నిమిషాలకు జరిగే మంత్రి రామానాయుడు కుమార్తె శ్రీజ, పవన్‌ల నిశ్చితార్థ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆశీర్వదించనున్నారు. ఈ వేడుకల్లో రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పలువురు మంత్రులు, టిడిపి, జనసేన, బిజెపి ముఖ్య నాయకులు, ప్రముఖులు పాలకొల్లు విచ్చేయనున్నారు.

# నిర్వాసితుల సమస్యలపై.. పార్లమెంట్‌లో పోరాడతా

**లక్షకుపైగా కుటుంబాల గురించి పట్టని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు**

**భూమి, విద్య, వైద్యం, ఇళ్లు వంటి అన్ని వసతులూ కల్పించాల్సిందే**

**కాంటూరుతో సంబంధం లేకుండా పునరావాసం, పరిహారం ఇవ్వాలి**


**సిపిఎం రాజ్యసభ ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్**

**బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లోని నిర్వాసిత, గిరిజన గ్రామాల్లో పర్యటన**

**అడుగడుగునా ఘనస్వాగతం, ఆపై సమస్యలు ఏకరువు పెట్టిన ఆదివాసీలు**

ప్రజాశక్తి - ఏలూరుప్రతినిధి, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి

'పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో లక్షా ఆరు వేల కుటుంబాలు ప్రభావితమవుతున్నాయి. ఆ కుటుంబాలకు ఇవ్వాల్సిన పరిహారం, పునరావాస ప్యాకేజీ, విద్య, వైద్యం, ఇళ్లు వంటి ఏ ఒక్క సదుపాయంపైనా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నిర్వాసితుల్లో 80 శాతం గిరిజనులే ఉన్నారు. నిర్వాసితుల సమస్యలపై పార్లమెంట్‌లో పోరాడతాం. సమస్యల పరిష్కారానికి పోరాటమే మనకు ఆయుధం' అని రాజ్యసభ సభ్యులు, సిపిఎం ఫ్లోర్‌లీడర్ జాన్ బ్రిట్టాస్ అన్నారు. శనివారం ఢిల్లీ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఆయన రోడ్డు మార్గం గుండా ఏలూరు చేరుకున్నారు. ఆయనకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.రామకృష్ణ స్వాగతం పలికారు. భోజన అనంతరం రోడ్డు మార్గం గుండా ఏజెన్సీ ప్రాంతానికి ఆయన బయల్దేరారు. జంగారెడ్డిగూడెం పొలిమేరకు వచ్చేటప్పటికీ సిపిఎం నాయకులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, ఎం.జీవరత్నం, పి.సూర్యారావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి, అంగన్‌వాడీలు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి మోటార్‌సైకిల్ ర్యాలీగా బుట్టాయగూడెం మండలం బయలుదేరారు. బుట్టాయగూడెం పొలిమేరల్లో సిపిఎం నాయకులు మొడియం నాగమణి, తెల్లం రామకృష్ణ, తెల్లం దుర్గారావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, గిరిజనులు డప్పులు, వాయిద్యాలతో స్వాగతం పలికి పూలమాలలు వేశారు. గిరిజనులు బ్రిట్టాస్, నేతల నుదుటిన తిలకం దిద్ది ఆహ్వానించారు. అక్కడి నుంచి ర్యాలీగా రెడ్డిగణపవరం చేరుకుని ఆ పంచాయతీ పరిధిలోని బండార్లగూడెంలో గిరిజన పోరాట యోధుడు కొమరం బాబూరావు, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి అరుణాంజలి ఘటించారు. అనంతరం అక్కడ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన జరిగిన సభలో గిరిజనులనుద్దేశించి జాన్‌బ్రిట్టాస్ మాట్లాడారు. తొలుత రవి మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులు, కాలనీల సమస్యలు, అక్రమ భూసేకరణ వంటి వివరాలు వెల్లడించారు. జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ గిరిజనులు, దళితులు అణగారిన వర్గాల గురించి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. భూమి, విద్య, వైద్యం, ఇళ్లు వంటి సమస్యల గురించి ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. అందరూ ఐకమత్యంతో కలిసి పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పేదలకు విద్య, వైద్యం వంటివాటికి పెద్దపీట వేస్తుందన్నారు. గిరిజన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. గిరిజన భూములు వారికి చెందే విధంగా రక్షణ కల్పిస్తుందని చెప్పారు. ఆంధ్రాలో ఎంపీలంతా ధనవంతులని, అణగారినవారి బాధలు వారికి పట్టడం లేదని తెలిపారు. ఎపి, కేంద్ర ప్రభుత్వాలు పేదల గురించి మాటలు చెప్పడం తప్ప ఆచరణలో ఏమీ లేదన్నారు. ఎర్రజెండా అందరికీ అండగా నిలిచి పోరాడుతుందన్నారు. పార్లమెంట్‌లో మీ సమస్యలపై మాట్లాడతానని చెప్పారు. అమరజీవి కొమరం బాబూరావు ఎర్రజెండా స్ఫూర్తితో అందరం ముందుకు సాగాలన్నారు. అక్కడ గిరిజనులు ఇచ్చిన వినతులను ఆయన స్వీకరించారు.



జాన్ బ్రిట్టాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు



వృద్ధురాలితో ముచ్చటిస్తున్న బ్రిట్టాస్

**టేకూరు కాలనీలో నేరుగా సమస్యల పరిశీలన**

అక్కడి నుంచి రోడ్డు మార్గం గుండా జీలుగుమిల్లి మండలంలోని టేకూరు కాలనీకి చేరుకున్నారు. కాలనీ నిర్వాసితులంతా పెద్దఎత్తున ఆయనకు స్వాగతం పలికారు. గిరిజనుడు బడగంటి వరహాలరెడ్డి వర్షాలకు తన ఇంటిలో నీరు కారుతుందని చెప్పడంతో ఆ ఇంటికి వెళ్లి బ్రిట్టాస్ పరిశీలించారు. వరహాలరెడ్డి తల్లి వృద్ధురాలు వాగాయమ్మను ఆప్యాయతతో పలకరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. నిర్వాసితులు పెద్దఎత్తున తమ వినతులు తీసుకొచ్చి ఆయనకు ఇచ్చారు. అందులో భూమికి భూమి ఇవ్వలేదని, పోడు భూములకు నష్టపరిహారం ఇవ్వలేదని, 18 ఏళ్లు నిండినవారికి ప్యాకేజీ ఇవ్వలేదని అనేక సమస్యలను తెలిపారు. టేకూరులో సభకు అధ్యక్షత వహించిన సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ముందుగా నిర్వాసితుల సమస్యలను వివరించారు. అనంతరం జాన్‌బ్రిట్టాస్ మాట్లాడారు. 2004లో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వంలో వామపక్షాలు మద్దతు ఇచ్చాయని, అప్పుడు కీలకమైన సమాచార హక్కు చట్టం, ఉపాధి హామీ చట్టం, విద్యాహక్కు చట్టం, అటవీ హక్కుల చట్టం, ఆహార భద్రత చట్టం వంటి ఐదు కీలక చట్టాలను తీసుకొచ్చామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ చట్టాలను సరిగా అమలు చేయడం లేదన్నారు. పోలవరం నిర్వాసితులకు ఆర్అండ్ఆర్‌తోపాటు అన్ని వసతులూ కల్పించి ప్రాజెక్టు పూర్తి చేయాలన్నారు. 18 ఏళ్లు నిండినవారికి పునరావాసం ఇవ్వాలన్నారు. గ్రామం నుంచి ఖాళీ చేసిన రోజు పరిగణనలోకి తీసుకుని పునరావాసం ఇవ్వాలన్నారు. దేశంలో పెద్ద ప్రాజెక్టు సర్దార్ సరోవర్ ప్రాజెక్టులో కూడా లక్షల మందిని ఇబ్బందులు పెట్టారన్నారు. రూ.80 వేల కోట్లతో కృష్ణా-గోదావరి అనుసంధాన ప్రాజెక్టు చేపడుతున్నారని, సర్వం కోల్పోతున్న ప్రజలను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. జాన్ బ్రిట్టాస్ ఇంగ్లీష్‌లో మాట్లాడగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, తులసీదాస్ తెలుగులోకి అనువాదం చేశారు. మరోసారి వచ్చేటప్పుడు తెలుగు నేర్చుకుని మీతో మాట్లాడతానని, మీ సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తడంతోపాటు రాష్ట్రపతి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తానని బ్రిట్టాస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల, నాయకులు లెనిన్, మంగరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

**భూమి లేదు.. ఇల్లూ లేదు**

**ఎ.అంజలి, బర్రింకలపాడు**

మాది వేలేరుపాడు మండలం అల్లూరునగర్. గతంలో వరదలకు మా ఇళ్లతో సహా అన్నీ కోల్పోయాం. ఇప్పటివరకు మాకు భూమికి భూమి కాని, ఇల్లు కాని నిర్మించలేదు. బర్రింకలపాడులో మా అమ్మవాళ్లింట్లో ఉంటున్నా. పునరావాస ప్యాకేజీ ఇచ్చి మమ్మల్ని ఆదుకోవాలి.

**ఇంటి పరిహారం రాలేదు.. కాలనీలో వసతుల్లేవు**

**కె.సుజాత, సిరివాక కాలనీ**

మేము సిరివాక గ్రామం నుంచి తరలివచ్చాం. ఇప్పటివరకు ఇంటి పరిహారం ఇవ్వలేదు. కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు వంటి మౌలిక సదుపాయాలు లేవు. పోడు భూములకు నష్టపరిహారం ఇవ్వలేదు. మా సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

## గౌతు లచ్చన్న మార్గం అనుసరణీయం

### కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

స్వాతంత్ర సమర యోధుడు సర్దార్ గౌతు లచ్చన్న బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమంలో కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు గౌతు లచ్చన్న మార్గం అందరికీ అనుసరణీయం అన్నారు. ఆయన పేద కుటుంబంలో జన్మించి జీవితాంతం అంటరానితనం నిర్మూలనకు, బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి అన్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర సమరం, రాజకీయంలో కీలకంగా వ్యవహరించిన గౌతు లచ్చన్న జయంతి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు, వసతి గృహాల అధికారులు సిహెచ్.మోహనరావు, కె.శ్రీనివాస్, గీత, జయంతి, రాజేశ్వరి, జి.ప్రసాద్, కె.సాగర్, కె.రామకృష్ణ పాల్గొన్నారు.



లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్



ప్రభుత్వ కాలనీలో ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

## ప్రభుత్వ కాలనీలో సౌకర్యాలు మెరుగుపర్చాలి

### సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్రలోని ప్రభుత్వ కాలనీలో వర్షపు నీరు నిలిచిపోవడంతో కాలనీ పరిస్థితి అధ్వానంగా ఉందని కేతా పద్మజ అన్నారు. శనివారం సిపిఎం నేతలు ప్రభుత్వ కాలనీని పరిశీలించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ కాలనీలో మోకాళ్లలోతు వరకూ నీళ్లు ఉన్నాయని, నిత్యావసర వస్తువులు, పాలు, కూరగాయలు వంటి వాటిని కూడా కాలనీ బయటికి వచ్చి తెచ్చుకోలేని పరిస్థితి ఉందని అన్నారు. తాగునీటి సదుపాయం లేకపోవడంతో కాలనీవాసులు ఆ నీటిలోనే నడిచి తెచ్చుంటున్నారని, ఈ కాలనీ పరిస్థితిని అధికారులు మెరుగుపర్చాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కాలనీని సందర్శించిన వారిలో నేతలు బత్తుల విజయకుమార్, కె.సుబ్బరాజు, ఇందుకూరి వెంకటరాజు, బొమ్మిడి ప్రభుదాసు, కేతా ప్రమోద్, బత్తుల సుశీల, కె.దివ్య, కె.కోటేశ్వరి, జి.నాగమణి తదితరులు ఉన్నారు.

## నక్కల కాలువ డ్రెయిన్‌కు శాశ్వత పరిష్కారం చూపాలి

### ఏపి కౌలురైతుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - ఆచంట

జిల్లాలో అనేక గ్రామాలు 30 వేల ఎకరాల పరిధిలో ప్రవహిస్తున్న నక్కల కాలువ మురుగు డ్రెయిన్‌కు శాశ్వత పరిష్కారం చేయాలని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జిల్లాలో కురిసిన అధిక వర్షాలకు ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించేందుకు శనివారం కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆచంట, పెనుగొండ మండలాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాలు, నక్కల కాలువ ముంపు వల్ల శేషమ్మ చెరువు, మార్టేరు, తూర్పుపాలెం, నెగ్గిపూడి, కొఠాలపర్రు, సోమరాజు చెరువు గ్రామాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. ఈ భూములన్నీ కౌలురైతులే సాగు చేస్తున్నారని, ఇప్పటికే ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడి పెట్టి నష్టపోయారని తెలిపారు. పలువురు రైతులు మాట్లాడుతూ దీనికి ప్రధాన కారణం పద్మాలచెరువు, మంగళపాలెం వద్ద కాలువపై ఉన్న వంతెన చిన్నగా నిర్మించి రెండు తూములే ఏర్పాటు చేయడంతో నీరు లాగడం లేదని తెలిపారు. పంట దెబ్బతిన్న ప్రతిసారీ పంట నష్టం కౌలు రైతులకు ఇవ్వకుండా భూ యజమానులకే ఇస్తున్నారని నేతల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన నేతలు శాశ్వత పరిష్కారంగా వడ్డిలంక డ్యామ్ వద్ద కోట్లాది రూపాయలతో నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్ మోటర్లను ఆధునీకరించి, డ్యామ్ అవతలి వైపునకు పైపులు నిర్మించి ముంపునీరు బయటకు తోడేలా చర్యలు తీసుకోవాలని, పంట కోల్పోయిన కౌలు రైతులను గుర్తించి, నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలురైతులు కేతా పద్మారావు, గుత్తుల ఏడుకొండలు, దొంగ సోమేశ్వరరావు, చింతపల్లి కొండయ్య, కడలి శ్రీను, గుబ్బల చినరాముడు పాల్గొన్నారు.



నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న కౌలు రైతు సంఘం నేతలు

## తులసీరామ్‌కు అరుదైన గౌరవం

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలోని పంజావేమవరం గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు, అన్నదాత మల్ల తులసీరామ్ (రాంబాబు)కు అరుదైన గౌరవం లభించింది. జాతీయ దినోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాజభవన్‌లో నిర్వహించే ఎట్ హోం కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌తో తేనేటి విందులో రాంబాబు పాల్గొన్నారు. వీరవాసరం మండలంలో రాంబాబు చేస్తున్న సామాజిక సేవలను రాజభవన్ గుర్తించి ఆయనకు ఎట్ హోమ్ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించారు. రాంబాబు మండలంలో వివిధ గ్రామాల్లో ఆదరణ లేని, వండుకునే అవకాశం లేని వృద్ధులకు, నిరాదరణకు గురైన వారికి ఇంటి వద్దకే భోజనం క్యారేజ్‌లు పంపిస్తున్నారు. ఇదే విధంగా భీమవరం కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రతి సోమవారమూ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదుదారులకు కూడా అక్కడికే భోజనాలు పంపిస్తున్నారు. ఈ విధంగా ఆయన చేస్తున్న సామాజిక సేవలను రాజభవన్ గుర్తించింది. రాంబాబు శనివారం ప్రజాశక్తితో మాట్లాడుతూ ఇది నాకు లభించిన అరుదైన గౌరవం అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అత్యంత ప్రముఖులతో, గవర్నర్‌తో తేనేటి విందులో పాల్గొనడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా నేను చేస్తున్న సామాజిక సేవ పట్ల మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు.



మల్ల తులసీరామ్ (రాంబాబు)

## న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

### ఆలిండియా లాయర్స్ యూనియన్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

న్యాయవాదులందరికీ కొత్త హెల్త్ కార్డులు ఇవ్వాలని ఆల్ ఇండియా న్యాయవాదుల యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పివిపి.లక్ష్మి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం శనివారం తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ హాల్లో జరిగింది. ఈ సమావేశంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో 60 వేల మంది న్యాయవాదులు ఉన్నారని, వారు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు న్యాయవాదులకు మ్యాచింగ్ గ్రాంట్‌ను మృతి చెందిన న్యాయవాది ఒక్కొక్కరికీ రూ.4 లక్షలు ఇస్తానని వాగ్దానం చేసిందని తెలిపారు. రాష్ట్రంలో 1,275 మంది న్యాయవాదులు వృత్తిలో మతి చెందితే నూట ముగ్గురికే ఇచ్చిందని, మిగిలిన వారికి ఇవ్వకపోవడం వల్ల వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. న్యాయవాదులపై దాడులు, హత్యలు జరిగినా వారికి ఎటువంటి రక్షణా లేదని, ప్రభుత్వం న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాది వృత్తి పట్ల నేడు ఎక్కువ మంది ఆకర్షితులై న్యాయవాది విద్యను అభ్యసిస్తున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 6,300 మంది కొత్త న్యాయవాదులు వారి పేర్లను న్యాయవాది నమోదు చేసుకుని ఉన్నారని, అటువంటి వారికి స్టైఫెండ్ ఇచ్చి ఆదుకోవాలని తెలిపారు. అనారోగ్యాలకు గురవుతున్న న్యాయవాదులకు ప్రభుత్వం మెడికల్ ఇన్సూరెన్స్ రూ.ఐదు లక్షల నుంచి రూ.15 లక్షల వరకు చేయించాలని విజ్ఞప్తి చేశారు. న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కలెక్టర్ కార్యాలయంలో మెమొండాలు సమర్పించాలని, కోర్టు పరిధిలోని సమస్యలను న్యాయమూర్తుల దృష్టికి తీసుకెళ్లాలని, జూనియర్ న్యాయవాదుల సమస్యలపై పోరాటాలు చేయాలని సంఘం సమావేశం పలు తీర్మానాలు చేసింది. ఈ సమావేశంలో న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి, గెద్ద విజయభాస్కర్, యడవల్లి మణికంఠ తేజ, డి.రాజారావు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న దిగుబాటి రాజగోపాల్

## ఆకాశం మేఘావృతం

ప్రజాశక్తి - పెనుమంట్ర

శనివారం మండలంలో రోజంతా మేఘావృతంగా ఉండడంతో వర్షం కురుస్తుందేమోనని రైతులు ఆందోళన చెందారు. మూడు రోజుల కిందట బుధవారం సాయంత్రం సుమారు నాలుగు గంటల పాటు కురిసిన కుంభవృష్టికి అతలాకుతలం అయిన రైతులు, ప్రజలు మరలా ఆ పరిస్థితి రాకూడదని కోరుకుంటున్నారు. ప్రస్తుతం చల్లని వాతావరణం వల్ల మండల ప్రజలు సేద తీరుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి నీట మునిగిన పొలాల్లో నీరు కాస్తా లాగింది.

# పల్లెలకు బస్సులెళ్తేనే.. ఉచితం సముచితం..!





స్త్రీ శక్తి పేరిట మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రెండు జిల్లాల్లో ఆర్భాటంగా ప్రారంభమైంది. మంత్రులు, ఎంపీలు, ఎంఎల్ఎలు ఈ బస్సులకు పచ్చజెండా ఊపడమే కాక బస్సుల్లో ప్రయాణించి కండక్టర్ అవతారంలో మహిళలకు జీరో టిక్కెట్లు జారీ చేశారు. ఇది కచ్చితంగా స్వాగతించదగిన పథకమే. అదే సమయంలో తమ ఉపాధి మాటేమిటంటూ ఆటో కార్మికులు సైతం రోడ్డెక్కారు. ఎందుకంటే చాలామంది బ్యాంకు అప్పులు, ప్రయివేటు ఫైనాన్స్‌లో ఆటోలు కొనుగోలు చేసి స్వయం ఉపాధి పొందుతున్నారు. కచ్చితంగా వారి ఉపాధి దెబ్బతినకుండా ప్రత్యామ్నాయ చర్యలు ప్రభుత్వం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇదే సమయంలో ప్రయాణికుల అవసరాలు, ప్రధానంగా గ్రామీణ ప్రజల రవాణా అవసరాలు తీర్చేలా బస్సులు నడిపేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

రెండు జిల్లాల్లో 85 రూట్లలో మహిళలు ఉచిత బస్సు ప్రయాణం వినియోగించుకునే అవకాశం ఉంది. ఈ రెండు జిల్లాల పరిధిలోని ఏడు ఆర్‌టిసి డిపోల్లో 607 బస్సులు ఉండగా వాటిలో నాలుగొందల బస్సులు ఉచిత ప్రయాణానికి అనువైన సర్వీసులుగా తిరుగుతున్నాయి. మిగిలిన బస్సులు సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎసి బస్సులు కావడంతో వాటిలో రాకపోకలు సాగించే అవకాశం లేదు. అయితే ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలు స్వాగతిస్తున్నా బస్సుల సంఖ్య, రూట్ల సంఖ్య పెంచాలని కోరుతున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల కొందరు ఎంఎల్ఎలు సైతం బహిరంగంగానే ఆర్‌టిసి అధికారులను కోరారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో పాడి పంటలతో సస్యశ్యామలంగా ఉండే జిల్లాగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు పేరుంది. ఇక్కడ జన సాంద్రత కూడా ఎక్కువ. అయితే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రోడ్డు కనెక్టివిటీ చాలా గ్రామాలకు ఉన్నా, బస్సు సౌకర్యం లేని గ్రామాలు సగానికిపైగా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి జిల్లాలో ఇరగవరం మండలం పరిశీలిస్తే రోడ్డు కనెక్టివిటీ ఉన్నా పెద్దసంఖ్యలో గ్రామాలకు ఆర్‌టిసి బస్సు సౌకర్యం లేదు. కనీసం ఆ మండల కేంద్రానికే సరైన బస్సు సౌకర్యం లేకపోవడం గమనార్హం. ఇదే పరిస్థితి ఆచంట, నరసాపురం, ద్వారకాతిరుమల, కామవరపుకోట, పెదవేగి, పెదపాడు, దెందులూరు మండలాలతోపాటు ఏజెన్సీలో గ్రామాలకు సరైన బస్సు సౌకర్యం లేదు. ఇక కుక్కునూరు, వేలేరుపాడు మండలాల వాసులైతే మన ఆంధ్రా బస్సులు లేకపోవడం, మధ్యలో కొంత తెలంగాణా ఉండటంతో వారికి ఉచితం అందని ద్రాక్షగానే మిగులుతోందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలుత గతంలో రద్దు చేసిన రూట్లలో బస్సులను పునరుద్ధరించడంతోపాటు జనావసరాలకు అనుగుణంగా కొత్త రూట్లలోనూ పల్లెవెలుగు బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అలాగే దూర ప్రాంత ప్రయాణాలకు సూపర్‌లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులే ఎక్కువగా నడుపుతున్నారు. ఈ క్రమంలో ఆయా జిల్లాల్లో తిరిగేందుకు ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగపడే అవకాశం ఉంది. అలాకాకుండా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు పెంచితే కనీసం సమీప నగరాలకైనా మహిళలు ఉచితంగా వెళ్లొచ్చే అవకాశం ఉంది. ఆ దిశగా ప్రభుత్వం, ఆర్‌టిసి చర్యలు తీసుకుంటే కచ్చితంగా స్త్రీ శక్తికి తగిన గుర్తింపు ఇచ్చినట్లని గ్రామీణ ప్రాంత మహిళలు అభిప్రాయపడుతున్నారు.

ఇక అదే సమయంలో ఆటో కార్మికులు ఈ నెల 14న ఆందోళనబాట పట్టారు. ఉచిత బస్సుకు తాము వ్యతిరేకం కాదని, తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలనేది వారి డిమాండ్. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఆటో కార్మికుల సేవలు తప్పనిసరి. అత్యవసర పరిస్థితుల్లోనూ ఆటో కార్మికులు అందించే సేవలు ఎనలేనివి. ఈ క్రమంలో ప్రభుత్వం వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చర్యలు తీసుకుంటేనే గ్రామీణులకు ఎటువంటి ఇబ్బందీ ఉండదు. లేనిపక్షంలో ఇటు ఆటో కార్మికులు ప్రత్యామ్నాయ ఉపాధి వైపు వెళ్తే గ్రామీణ ప్రజలు రవాణా సదుపాయాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందనే చందంగా కాకుండా ఉచితబస్సు పథకం కొనసాగాలంటే కచ్చితంగా ఆటో కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

- వివిఎస్‌వి.ప్రసాద్

## పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరించాలి

### నేడు జిల్లా సదస్సు

ప్రజాశక్తి - భీమవరం

ఇపిఎఫ్ 95 పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరించాలని, కనీసం పింఛను రూ.9 వేలు ఇవ్వాలని కోరుతూ ఆదివారం జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎర్ర అజయ్ కుమార్, జిల్లా కన్వీనర్ టి.గంగరాజు కోరారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విధులు చేశారు. ఇపిఎఫ్ 95 పెన్షన్‌దారులు చాలా నష్టపోతున్నారని, ఐదేళ్లకోసారి రివ్యూ చేస్తామని, గత ప్రభుత్వాలు హామీలు ఇచ్చినా అమలు జరగలేదని తెలిపారు. అదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రభుత్వ రంగాలు, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో పని చేసిన పెన్షన్‌దారుల సమస్యల పట్ల పాలకులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని తెలిపారు. చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న పెన్షన్‌దారుల సమస్యలపై చర్చించి రాబోయే కాలంలో తీసుకునే కార్యాచరణపై ఈ సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు హాజరుకానున్నారని తెలిపారు. జిల్లాలో పింఛనుదారులందరూ ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జరిగే జిల్లా సదస్సుకు హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## మొదటి రోజు రద్దీ సాధారణమే..

ప్రజాశక్తి - పెనుమంట్ర


మహిళలు శనివారం ఉచిత బస్సు ప్రయాణం వైపు ఆసక్తి చూపలేదు. యథావిధిగా బస్సులు కొద్ది మంది మహిళలతో నడిచాయి. పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, రావులపాలెం రూట్లలో బస్సుల సంఖ్య ఎక్కువ కావడం వల్ల ఆటోలు ఎక్కువ తిరగలేదు. అయితే మార్టేరు సెంటర్ నుంచి గంట, రెండు గంటలకు మాత్రమే బస్సు వచ్చే విధానం ఉన్న ఆచంట వయా కోడేరు మార్గంలో ఎప్పటిలాగే ఆటోలు తిరగడం కనిపించింది. వచ్చే సోమవారం నుంచి ఉచిత బస్సు ప్రయాణంలో మహిళా ప్రయాణికుల రద్దీ కనిపిస్తుందని పలువురు చెబుతున్నారు.

## మెగాస్టార్ చిరంజీవికి ఫొటో బహూకరణ

### అభిమానం చాటుకున్న పోలిశెట్టి కుమార్తె

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని కొప్పర్రు గ్రామానికి చెందిన జనసేన నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త పోలిశెట్టి శ్రీనివాస్ కుమార్తెకు మెగాస్టార్ అంటే ఎంతో అభిమానం. ఆ అభిమానంతో చిరంజీవి చిత్రపటాన్ని గీసి ఆయనకు బహూకరించాలని అనుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ దగ్గర ఆయన్ను కలిసి మెగాస్టార్ ఫొటోను స్వహస్తాలతో తయారుచేసి బహుమతిగా అందించింది. ఆ చిత్రాన్ని చూసిన మెగాస్టార్ ఎంతో సంతోషించారని శ్రీనివాస్ తెలిపారు. చిరంజీవికి పోలిశెట్టి శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. అనంతరం చిరంజీవి, పోలిశెట్టి శ్రీనివాస్ ఇరువురు పలు విషయాలపై చర్చించుకున్నారు.


చిరంజీవికి ఫొటో బహూకరిస్తున్న పోలిశెట్టి శ్రీనివాస్ కుమార్తె

## కల్తీపై తనిఖీలు ఏవీ..!

### వినియోగదారుల ఉద్యమం నీరుగారుస్తున్నారు

### అధికారుల తీరుపై బంగారయ్య ఆవేదన

ప్రజాశక్తి - ఆకివీడు

వినియోగదారుల పట్ల, వినియోగదారుల ఉద్యమాల పట్ల జిల్లా యంత్రాంగం చిన్నచూపు చూస్తుందని వినియోగదారుల సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర సహాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కల్తీల ఖిల్లాగా మారిన అన్ని రంగాల్లో నకిలీ వస్తువుల విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. బంగారం దుకాణాలు కొన్ని ముఖ్యమైన మినహా మిగిలిన వారు ఎవరూ రోజువారీ లేకుండా విక్రయాలు చేస్తున్నారన్నారు. లక్షలాది రూపాయలు వ్యాపారం చేస్తున్నా, ప్రభుత్వ సొమ్ము ఎగవేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జెసి విజిలెన్స్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

**ఉద్యమకారులంటే చిన్న చూపు..**

వినియోగదారుల ఉద్యమం పట్ల జిల్లా యంత్రాంగం చిన్నచూపు చూస్తోందని బంగారయ్య వాపోయారు. వినియోగదారుల హక్కులే శ్వాసగా 30 సంవత్సరాలుగా ఉద్యమం చేస్తున్న వారిని సైతం ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదన్నారు. ప్రోత్సాహక ప్రశంసా పత్రం కూడా అందించకపోవడం దయనీయం అన్నారు. జనవరి 26, ఆగస్టు 15వ తేదీలలో ముగ్గురు ఉత్తమ సేవకులను ఎంపిక చేసి ప్రశంసా పత్రాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా కానీ జిల్లా యంత్రాంగానికి పట్టలేదన్నారు. జిల్లాలో ఉద్యమ స్ఫూర్తిని జిల్లా యంత్రాంగం బలహీన పరుస్తోందనడానికి ఇది ఉదాహరణగా వివరించారు.

## ఘనంగా బొలిశెట్టి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


చీరలు పంపిణీ చేస్తున్న టిడిపి నేతలు

విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది చిరు వ్యాపారులకు రూ.18 వేల విలువైన తోపుడు బండ్లను ఎంఎల్‌ఎ సతీమణి అనూరాధ, జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం పట్టణంలో చిరు వ్యాపారులకు, పేద ప్రజలకు ఎప్పుడు ఏ ఆపద వచ్చినా వారికి సహాయ సహకారాలు అందించడానికి బొలిశెట్టి హెల్పింగ్ హాండ్స్ అందుబాటులో ఉంటామని తెలిపారు. పట్టణంలోని ఈతకు రోడ్డు ఆర్‌టిసి బస్టాప్ వద్ద వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు చిటకన శ్రీనివాస్, అత్తిలి తాతయ్య, టిడిపి గ్రామ అధ్యక్షుడు నండమూరి రవితేజ, నాయకులు గన్నమని అనిల్, కొండేటి నాగేశ్వరరావు, పలివి సత్యనారాయణ, నందమూరి రామారావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు భగత్ సింగ్ కాలనీలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెంకటరామయ్య ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు, ఆహార పట్లాలు పంపిణీ చేశారు. వడ్డెర సంఘం ఆధ్వర్యాన పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, పలకలు అందజేశారు. కార్యక్రమంలో జనసేన తాడేపల్లిగూడెం పట్టణ అధ్యక్షుడు వర్తనకపల్లి కాశి, నాయకులు చేపల రమేష్, గుండు భోగుల సురేష్, ఉప్పలపాటి బాబురావు, ఎస్‌కె.వల్లి, వడ్డెర సంఘ అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

## యువత క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

### ఎస్‌ఐ మహమ్మద్ నసీరుల్లా

ప్రజాశక్తి - ఉండి

యువత క్రీడలపట్ల ప్రత్యేక శ్రద్ధచూపి మంచి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఉండి ఎస్‌ఐ మహమ్మద్ నసీరుల్లా అన్నారు. 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి ఉండి గ్రామంలోని కలిదిండి అబ్బాయి రాజు జన్మభూమి పార్కులోని బ్యాడ్మింటన్ హబ్ ఇండోర్ కోర్టులో ఇంటర్నల్ టోర్నమెంట్ టిడిపి మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో ప్రథమ బహుమతి విజేతలుగా కరిమెరక శివతేజ, కొండ్రుతు స్వామి నిలవగా రెండవ బహుమతి విజేతలుగా మాదే ఏసు, పెద్దిరెడ్డి భరత్ చంద్ర నిలిచారు. వీరికి ఉండి ఎస్‌ఐ మహమ్మద్ నసీరుల్లా, టిడిపి మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ నసీరుల్లా, కరిమెరక నాగరాజు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధచూపి క్రీడల్లో రాణించి, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని వారు ఆకాంక్షించారు. క్రీడల వల్ల శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు మంచి ఆరోగ్యం కూడా ఉంటుందని వారు అన్నారు. నేటి యువత చెడు వ్యసనాలకు ఆకర్షితులై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, అలా కాకుండా యువత మాదక దవ్యాలకు దూరంగా ఉంటూ క్రీడలు, చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలని వారు విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఎంతో ప్రతిష్టాత్మకంగా అబ్బాయి రాజు జన్మభూమి పార్క్‌ను పున: నిర్మించడం జరిగిందని, ఆయన ఆదేశాలతో యువతకు బ్యాడ్మింటన్ కోర్టు, క్రికెట్‌కు ప్రత్యేక ఏర్పాటు చేయడం జరిగిందని వారన్నారు. మండలంలోని యువత అబ్బాయి రాజు జన్మభూమి పార్క్‌లోని బ్యాడ్మింటన్ కోర్టును సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా భవిష్యత్తుకు మంచి జరుగుతుందని వారు తెలియజేశారు. అనంతరం టోర్నమెంట్లో విజేతలకు, పాల్గొన్న క్రీడాకారులందరికీ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ క్రీడాకారులు, స్థానికులు పాల్గొన్నారు.

## అత్యాచార ఘటనలో ముద్దాయికి రిమాండ్

ప్రజాశక్తి - నరసాపురం

మైనర్ బాలికలపై ఎటువంటి వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద హెచ్చరించారు. శనివారం నరసాపురం డిఎస్‌పి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీవేద మాట్లాడుతూ మండలంలోని గ్రామంలో తొమ్మిదేళ్ల బాలికపై ఈనెల 13వ తేదీన అత్యాచారం జరిగిందన్నారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నరసాపురం రూరల్ ఎస్‌ఐ టి.వెంకట సురేష్ కేసు నమోదు చేసారన్నారు. నిందితుడు కుడుపూడి నాగ బాలాజీని శనివారం అరెస్ట్ చేసి న్యాయమూర్తి ముందు హాజరపరచుగా నిందుతుడికి న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు. ఈ సమావేశంలో నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గా ప్రసాద్, ఎస్‌ఐ టి. వెంకట సురేష్, కానిస్టేబుల్స్ బి.పుల్లారావు, ఎస్.అయ్యప్ప, నాగు పాల్గొన్నారు.

## తప్పిపోయిన బాలుడు అప్పగింత

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణ పోలీసులు తప్పిపోయిన ఏడేళ్ల బాలుడిని రెండు గంటల్లోనే గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. శుక్రవారం రాత్రి భీమవరం మండలం తుందుర్రు గ్రామానికి చెందిన ఆరేటి నవనీత్ బాలుడు తన కుటుంబ సభ్యులతో నరసాపురం బంధువులు ఇంటికి వివాహానికి హాజరయ్యారు. రాత్రి 7.30 సమయంలో నవనీత్ కనపడటం లేదని పోలీసులుకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు రావడంతో సిఐ బి.యాదగిరి, ఎస్‌ఐ సిహెచ్. జయలక్ష్మి సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా గాలింపు చేపట్టారు. చివరికి బాలుడు ఇంటి టెర్రస్‌పై దాక్కున్నట్లు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.



# స్వచ్ఛందంగా గుర్రపు డెక్కకు కలుపు మందు పిచికారీ

## నీటి ప్రవాహానికి అడ్డంకులను తొలగించాలని రైతుల వేడుకోలు

ప్రజాశక్తి - ఆచంట

గత 5 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు నక్కల తాడేరు డ్రెయిన్లు ఉధృతంగా మారడంతో పోడూరు మండలం తూర్పుపాలెం పంచాయతీ పరిధి ఆనందరావుపేటలో ఉన్న నక్కల కాలువపై శిథిలావస్థకు చేరిన వంతెన వద్ద ప్రవాహానికి అడ్డంగా గుర్రపు డెక్క పేరుకుపోయింది. ఈ సమీపంలో ఉన్న సుమారు 100 ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. దీంతో పొలాలన్నీ జలాశయాలను తలపించడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎగువ నుంచి భారీగా మురుగునీరు కిందకు రావడంతో పంట పొలాల్లో సుమారు నాలుగు అడుగుల నీరు నిలిచిపోయింది. శిథిలావస్థకు చేరిన వంతెన వద్ద విపరీతంగా గుర్రపు డెక్క పేరుకుపోవడంతో ఆనందరావుపేటకు చెందిన రైతులు స్వచ్ఛందంగా కలుపుముందు పిచికారీ చేసుకుంటున్నారు. గుర్రపు డెక్క పేరుకుపోవడంతో నక్కల కాలువ గట్టు ప్రమాద స్థితికి చేరింది. స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేదంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి గుర్రపుడెక్కను తొలగించి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మూడే మోజెస్, కె.కుమార్ రాజు, పి.సంపత్ రావు, జి.పెద్దిరాజు, డి.చంద్రరావు, ఎం.గోపాలం, బి.సతీష్ కుమార్, బి.రామారావు సొంత డబ్బులతో గుర్రపు డెక్కకు కలుపు మందు పిచికారీ చేసుకున్నారు.


గురపు డెక్కకు కలుపు మందు పిచికారీ చేస్తున్న రైతులు..

## రైతులకు అండగా ఉంటా..

### మహిళా కూలీలను కలిసిన ఎంఎల్‌ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

చిట్టవరం గ్రామ పంచాయతీలో స్థానిక పంట పొలాల వద్ద ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ మహిళలను కలుసుకుని వారితో ఆత్మీయంగా మాట్లాడారు. వారి సమస్యలు, అవసరాల గురించి తెలుసుకుని రైతాంగానికి ప్రభుత్వం అందించే సాయం, పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎని ప్రత్యక్షంగా కలిసి మాట్లాడిన మహిళలు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యలను ఆయనకు వివరిస్తే వెంటనే స్పందించడం చూసి సంతోషం కలిగిందని వారు పేర్కొన్నారు. ఎంఎల్‌ఎ రైతులకు అన్ని విధాల సహకారం అందిస్తానని భరోసా ఇస్తూ, క్షేత్ర స్థాయిలో ప్రజలతో తరచూ మమేకం అవుతూ ఉండడం కొనసాగుతుందని తెలిపారు.


బెడ్‌సీట్లు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

## పిహెచ్‌సికి బెడ్ సీట్లు, ఫోకస్ లైట్ వితరణ

ప్రజాశక్తి - ఆచంట

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు అన్నారు. పాలకొల్లు గ్రామానికి చెందిన నాలం సీతారత్నం ట్రస్ట్ తరపున ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 12 నూతన బెడ్ సీట్లు, పిల్లో కవర్లు, ఆపరేషన్ థియేటర్‌కు సంబంధించి ఫోకస్ లైట్‌ను ట్రస్ట్ సభ్యులు గుప్తా, పద్మ, మోహాజీ, వాణి, వైవి.సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హైందవి అభినందించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఇరువురు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సిబ్బంది కలిసి మెలిసి పనిచేసి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మోహన్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశాలు, హెల్త్ అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

### విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం మండలంలోని చిట్టవరం గ్రామంలో స్థానిక అంజనాపుత్ర చిరంజీవి యువసేన ఆధ్వర్యాన జరిగిన మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. అభిమానులు గత కొన్ని సంవత్సరాలుగా ఆయన పుట్టినరోజు సందర్భంగా వారం రోజులపాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పుట్టినరోజు కేకు కట్ చేసి అభిమానులకు పంచారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తాడి లక్ష్మణరావు, అభిమానులు కోపల్లి శ్రీనివాస్, పోలిశెట్టి సత్తిబాబు, పోలిశెట్టి బాబి, పైడికొండ కృష్ణ, గ్రంధి శ్రీను, చెన్నంశెట్టి నాగు, జడ్డు సత్తిబాబు, అడ్డాల బాబి, మద్దుల రమేష్, కేసరి రంగారావు, నాయకులు రేవు ప్రభుదాసు, జక్కంపూడి బాబ్జి, కొప్పిరెడ్డి నాగు, నడిపూడి పెద్దిరాజు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని వాజ్‌పేయికి నివాళి


**ఆచంట :** పరిణతి చెందిన రాజకీయ నైపుణ్యంతో, విప్లవాత్మక నిర్ణయాలతో దేశాన్ని అభివృద్ధి వైపు నడిపించిన నాయకుడు, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి అని రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ అన్నారు. అటల్ బిహారీ వాజ్ పేయి వర్ధంతి సందర్భంగా ఆచంట కచేరి సెంటర్లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, కేతా మీరయ్య, నాయకులు నేదునూరి శ్రీనుబాబు, బలుసు మాధవి, కోన సత్యప్రసాద్, నెలపాటి ఏసురత్నం, గెద్దాడ దుర్గాప్రసాద్, గుడాల ఏడుకొండలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ సిఐ రాంబాబుకు ఉత్తమ పురస్కారం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఎక్సైజ్ స్టేషన్ సిఐ ఎస్.రాంబాబు రాష్ట్ర స్థాయి ఉత్తమ పురస్కారం అందుకున్నారు. 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఎక్సైజ్ కమిషనర్ నితీష్ కుమార్, ఇన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సిఐ రాంబాబును ఎస్‌ఐలు ఖాసీం, జైనులాబ్దిన్‌తో పాటు ఇతర సిబ్బంది అభినందించారు.

నరసాపురం ఎక్సైజ్ ఎస్‌ఐ ఎస్‌కె.ఖాసీం జిల్లా కలెక్టర్, మంత్రి నిమ్మల రామానాయుడు చేతుల మీదుగా ప్రతిభ పురస్కారం అందుకున్నారు. ఖాసీం సర్వీసులో, అత్యుత్తమ పనితీరుకు ఉత్తమ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ఖాసీంను సిఐ ఎస్.రాంబాబు, ఎక్సైజ్ ఎస్‌ఐ జైనులాబ్దిన్, రైటర్ ప్రసాద్ అభినందించారు.


ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న సిఐ రాంబాబు

## డిప్యూటీ తహశీల్దార్‌కు బెస్ట్ డిటి అవార్డు

ప్రజాశక్తి - పెనుమంట్ర

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో స్థానిక రెవెన్యూ కార్యాలయం డిప్యూటీ తహశీల్దార్ కె.ఏలియమ్మకు బెస్ట్ డిటి అవార్డు ఆర్‌డిఒ దాసిరాజు ప్రధానం చేసినట్టు తహశీల్దార్ వై.రవికుమార్ శనివారం ఇక్కడ తెలిపారు. ఆలమూరు విఆర్‌ఒ కె.రాజు, మార్టేరు విలేజ్ సర్వేయర్ ఎం.మధు, పెనుమంట్ర రీ సర్వే డిటి ఎ.విజయ్‌కుమార్‌లకు బెస్ట్ సర్వీస్ అవార్డ్స్ ఆర్‌డిఒ నుండి అందుకున్నారని అన్నారు. మండలం నుండి అవార్డ్స్ అందుకున్న నలుగురు ఉద్యోగులను ఆయనతో పాటు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు, సిబ్బంది సతీష్ అభినందించారు.


అవార్డు అందుకుంటున్న డిప్యూటీ తహశీల్దార్ ఏలియమ్మ

## రోటరీ క్లబ్ ఆఫ్ నరసాపురానికి రాష్ట్ర స్థాయికి అవార్డు


అవార్డు అందుకుంటున్న రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ సత్యవతి

ప్రజాశక్తి - నరసాపురం

రోటరీ క్లబ్ ఆఫ్ నరసాపురం(2023-2025) చేపట్టిన విశిష్టమైన సేవా కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తించి రాష్ట్ర స్థాయి అవార్డును అందజేసింది. ఈ అవార్డును భీమవరం మెజిస్ట్రేట్ కార్యాలయంలో జరిగిన 79వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ సిహెచ్.నాగరాణి చేతుల మీదగా గన్నబత్తుల సత్యవతి అందుకున్నారు. ఈ సందర్భంగా రోటరీ ఇంటర్నేషనల్ అసిస్టెంట్ గవర్నర్ గన్నబత్తుల సత్యవతి మాట్లాడుతూ ఈ గౌరవం తన వ్యక్తిగత విజయంకాదు, మన నరసాపురం రోటరీ కుటుంబం కలిసి రాసుకున్న సేవా చరిత్రకు ప్రతీక అన్నారు. ప్రతి సభ్యుడు చూపిన నిస్వార్ధ సహకారం, వెన్నంటి నిలిచిన సోదర సోదరీమణుల ప్రోత్సాహం, అంకితభావం ఈ విజయానికి మూల కారణమన్నారు. సమాజ సేవ, ప్రజా అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, విద్యా ప్రోత్సాహం, అనేక సామాజిక సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించిన రోటరీ క్లబ్ ఆఫ్ నరసాపురం ఈ అవార్డుతో మరొక మైలురాయిని చేరుకుందన్నారు.

# మహిళలకు స్త్రీ శక్తి ఓ వరం

## టిడిపి మండల మహిళా అధ్యక్షులు భూపతిరాజు రాధాదేవి

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా స్వాతంత్ర దినోత్సవం రోజున మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించడం ఓ వరమని టిడిపి మండల మహిళా అధ్యక్షులు భూపతిరాజు రాధాదేవి అన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణకు మహిళల తరపున కృతజ్ఞతలు తెలుపుతూ బొకే అందించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సూపర్ సిక్స్ పథకాలు అన్నీ అమలుచేయడం పట్ల హర్షం తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంలో రాష్ట్ర నలుమూలలా ఎక్కడికైనా మహిళలందరూ వెళ్లడం ముదావహం అని, అయితే మహిళలు బస్సులో ప్రయాణించేటప్పుడు మీ దగ్గర ఉన్న ఆధార్ కార్డు లేదా పాన్ కార్డు, రేషన్ కార్డు, గుర్తింపు కార్డు తప్పనిసరిగా బస్ కండక్టర్‌కి చూపించాలని తెలిపారు. కండెక్టర్ జీరో టికెట్ ఇస్తారని తెలియజేశారు. మహిళలందరూ ఉచిత బస్సు ప్రయాణాన్ని వారి అవసరాన్ని బట్టి మాత్రమే ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.


ఎంఎల్‌ఎ పితానికి బొకే అందజేస్తున్న రాధాదేవి

# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


పెనుగొండ : గోపిక, యశోదమ్మ వేషధారణలో విద్యార్థులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. కొన్ని గ్రామాల్లో శ్రీకృష్ణ, శ్రీరామ ఆలయాల వద్ద, కొన్ని ప్రధాన వీధుల్లోను యువకులు, పిల్లలు ఉట్టి కట్టి సాయంత్రం వేళ ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. కొందరు ఇళ్ల గుమ్మాల్లో, వరండాల్లో, హాళ్లలో చిక్కటి పాలతో కృష్ణ పాదాలు రంగవల్లులు వేసి స్వాగతం పలికారు.

**పాలకొల్లు :** పాలకొల్లు కెనాల్ రోడ్‌లోని శ్రీకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణాష్టమి మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం, సాయంత్రం ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా రాత్రి ఉట్టి కొట్టే కార్యక్రమం చేశారు. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో ఉట్టి మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

**పెనుగొండ :** కృష్ణాష్టమి వేడుకలు పెనుగొండ భాష్యం స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గోపిక, యశోదమ్మ వేషధారణతో అలం కరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వై.అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులకు కృష్ణాష్టమి విశిష్టతను వివరిస్తూ ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్య క్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మొగల్తూరు :** మండలంలోని పలు గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని గొల్ల గూడెం, అగ్రహారం, పేరుపాలెం కేపీ పాలెం తదితర గ్రామాలలో కృష్ణాష్టమి వే డుకలు పురస్కరించుకొని ఉట్టి ఏర్పాటు చేసి కొట్టారు. వాటిలో గెలుపొందిన వారికి ప్రోత్సాహక బహుమతులను అందించారు.

**ఉండి :** మండలవ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉండి సంత మార్కెట్లో ఉన్న వేణుగోపాల యాదవ సంఘం ఆధ్వర్యాన కృష్ణాష్టమి సందర్భంగా ఉండి గ్రామ పురవీధుల్లో శ్రీకృష్ణుడు, గొల్లభామ వేషధారణతో ఊరేగింపు నిర్వహించారు. నిమ్మల పేటలో శ్రీశశి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఆధ్వర్యాన కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించి చిన్నారులకు శ్రీకృష్ణుడు, గొల్లభామ వేషధారణ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. రాత్రి ఉట్టి కొట్టి స్వామివారి ప్రసాదం పంపిణీ చేశారు. చిలుకూరులో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలలో డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు పాల్గొని ఉట్టి కొట్టారు.


ఉండిలో యాదవ సంఘం ఆధ్వర్యాన..


మొగల్తూరులో ఉట్టి కొడుతున్న చిన్నారులు

## సిఎం సహాయనిధి పేదల పాలిట వరం

### ఎంఎల్‌ఎలు నాయకర్, రాధాకృష్ణ

ప్రజాశక్తి - నరసాపురం

సిఎం సహాయనిధి పేదల పాలిట వరమని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం ఎంఎల్‌ఎ నాయకర్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సిఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ, ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని నలుగురుకి రూ.2,48,250 చెక్కులు అందజేశారు.

**తణుకు :** సొంత ఖర్చులతో వైద్యం చేయించుకున్న వారికి ఆర్థిక భారం లేకుండా చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిధులు కేటాయించి వారి కుటుంబానికి భరోసా కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు నియోజకవర్గంలోని 52 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా శనివారం సంబంధిత బాధిత కుటుంబాలకు రూ.25.96 లక్షలు చెక్కుల రూపంలో ఎంఎల్‌ఎ రాధాకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడి వారి సొంత ఖర్చులతో వైద్యం చేయించుకున్న వారికి ఆసరాగా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆచంటేశ్వరుని ఆలయంలో ఎస్‌ఐ రఘునాథబాబు

ప్రజాశక్తి - ఆచంట

శ్రావణమాసం పురస్కరించుకొని శనివారం విద్యుత్ శాఖ ఎస్‌ఇ రఘునాథబాబు, ఆయన సతీమణి భాగ్యశ్రీ ఆచంటేశ్వరుని శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆదిమూలం వెంకటసత్యనారాయణ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ నెక్కంటి గజేశ్వరరావు, నాయకులు గొడవర్తి శ్రీరాములు, ఎలక్ట్రికల్ ఎఇ రామారావు(రాము) ఎస్‌ఇ దంపతులకు స్వాగతం పలికారు.

## క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయంలో చీఫ్ వివేకానంద రెడ్డి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు శ్రీక్షీర రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఇంజనీర్ ఇన్ చీఫ్, ఆర్అండ్‌బి రోడ్స్ విజయవాడ ఎంవిఆర్.వివేకానందరెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ముచ్చర్ల శ్రీనివాసరావు ఆయనకు శేష వస్త్రంతో సత్కరించారు. పాలకొల్లు ఆర్అండ్‌బి డిఇఇ బివి.రమణ, భీమవరం డిఇఇ పివి.రామరాజు, సీనియర్ అసిస్టెంట్(ఆర్అండ్‌బి) భీమవరం, ఆలయ సూపరింటెండెంట్ పి.వాసు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.